# ‘‘యెరూషలేము మొదలుకొని’’ (2:1-13)

బైబిల్లో ఉండే కొన్ని అధ్యాయాలు ఎంతగొప్పవంటే, వాటిని వర్ణించడానికిగల మన సామర్థ్యాన్నే అవి తృణీకరిస్తాయి. వాటిలోకొన్ని, ఆదికాండం 1, యెషయా 53, రోమా 8, 1 కొరింథీ. 15, హెబ్రీ. 11 అనేవి. కార్య గ్రంథంలో రెండవదికూడా గొప్ప అధ్యాయమే. గ్రంథమంతా కూడా ఈ ఒక్క అధ్యాయం మీద ఆధారపడి నందున, దీన్ని బైబిలు చక్రానికి మధ్యభాగం అని పిలవడం జరిగింది.

క్రీస్తు పునరుత్థానం తరువాత వచ్చిన తొలిపెంతెకొస్తు దినాన్ని గూర్చి కార్యాలు2 తెలియజేస్తుంది. ఆ పండుగ దినాన (దానివెంట) ఏమి జరిగిందో అది వర్ణిస్తుంది. సంఘం స్థాపింపబడింది, తొలిసారిగా సువార్త పూర్తిగా ప్రకటించబడింది, మానవుల లోనుండి క్రైస్తవులనబడే క్రొత్త రకం ఉనికిలోనికి వచ్చింది (11:26). ఆ దినం దేవుని సంకల్పానికి, ఏర్పాటుకు శిఖరాగ్రం (లేక) అత్యున్నతమైన దినం (ఎఫెసీ. 3:10-11).

ఆ దినంయొక్క సంభవాలను మనం చదివేటప్పుడు, యెషయా 2లో ఉపయో గించబడిన కొన్ని ప్రాముఖ్యమైన మాటలవైపు మన దృష్టిని మల్చుదాం. ఆ అధ్యాయం మెస్సీయాయొక్క రాజ్యస్థాపనను గురించి మాట్లాడుతుంది: ‘‘అంత్య దినములలో ... యెహోవా మందిర పర్వతము ... స్థిరపరచ’’ బడుతుంది (2 వ.). ‘‘ప్రవాహము వచ్చినట్టు సమస్త అన్యజనులు దానిలోనికి వచ్చెదరని’’ యెషయా అంటున్నాడు (2 వ.). “ఆ కాలమున సీయోనులోనుండి ధర్మశాస్త్రము యెరూషలేమునుండి యెహోవా వాక్కు బయలువెళ్లు’’తుందని అతడు గుర్తించాడు’’ (3 వ.).

పునరుత్థానుడైన తరువాత ప్రభువైన యేసు తన శిష్యులతో మాట్లాడినప్పుడు యెషయాయొక్క పదజాలాన్ని వినియోగించారు:

> క్రీస్తు శ్రమపడి మూడవ దినమున మృతులలోనుండి లేచుననియు యెరూషలేము మొదలుకొని[1] సమస్త జనములలో ఆయన పేరట మారుమనస్సును పాపక్షమాపణయు ప్రకటింపబడుననియు వ్రాయబడియున్నది (లూకా 24:46-47).

ఆయన ఆరోహణానికి ముందుగా, పరిశుద్ధాత్మ వాగ్దానంకొరకు **యెరూషలేములో** కనిపెట్టియుండుడని యేసు తన శిష్యులకు ఆజ్ఞాపించారు (1:4-5). **యెరూషలేము** మొదలుకొని భూదిగంతములవరకు వారాయనకు సాక్షులైయుండాలని

నొక్కిచెప్పారు (1:8). ఆయన ఆరోహణమైన తరువాత, శిష్యులు **యెరూషలేమునకు** తిరిగివచ్చి, పరిశుద్ధాత్మ తమమీదికి వచ్చేలా కనిపెడుతున్నారు (లూకా 24:52-53; అపొ. 1:12-13; cf 2:1-4).

అపొ. 2లోని సంభవాలు తొలి సంభవాలైయున్నట్టు అపొ. 11లో నొక్కి చెప్పాడు. కొర్నేలి యింటిలో ఏమి జరిగిందో అతడు వివరించుతూ, ''- నేను మాటలాడ నారంభించినప్పుడు పరిశుద్ధాత్మ మొదట మన మీదికి దిగిన ప్రకారము వారిమీదికిని దిగెను'' అని తెలిపాడు (15 వ.). దీన్నిబట్టి, అపొ. 2లోని పెంతెకొస్తు దినం యెరూషలేములో ఆరంభాల దినంగా ఉంది. అపొ. 2లో, యెషయా, క్రీస్తు తదితరుల మాటలు ఎలా నెరవేర్చబడ్డాయో ఈ పాఠంలో మనం చర్చించబోతాం.

మొదట ఇది జరిగిన సందర్భంలోని దృశ్యాన్ని ఆలోచన చేద్దాం. పెంతెకొస్తు అనేది ప్రధానమైన యూదుల పండుగలలో ఒకటి: పస్కాపండుగ (ఏప్రిల్ మధ్య రోజులు), పెంతెకొస్తు దినం (జూన్ ప్రారంభదినాలు), పర్ణశాలలపండుగ (అక్టోబరు).[2]

పాతనిబంధనలో పెంతెకొస్తు దినానికి పలురకాలైన పేర్లున్నాయి: వారముల పండుగ[3] (పస్కా అనంతరం ఏడు వారాలకు వస్తుంది గనుక దీన్ని అలా పిలిచారు (లేవీ. 23:15; ద్వితీయో. 16:9); కోత పండుగ (నిర్గమ. 23:16) - (ఎందుకంటే, యిది యవల కోతకాలాన్ని సూచిస్తుంది), ప్రథమ ఫలముల పండుగ (నిర్గమ. 23:16; సంఖ్యా. 28:26) - (ఎందుకంటే, ఆ దినాన వారు గోధుమ పంటయొక్క ప్రథమ ఫలాలను అర్పిస్తారు).[4] మహా అలెగ్జాండరుయొక్క దండయాత్ర తరువాత ఆయాదేశాల్లో గ్రీకుభాష వ్యాపింపజేయబడింది. ''యాభైయవ''[5] అని అర్థమిచ్చే ''పెంటెకోస్''[6] అనే పేరుతో ఆ పండుగ (తరువాత కాలంలో) పిలువబడింది. పస్కా అనంతరం ఏభై దినాలకు యిది ఆచరింపబడుతుందనే భావాన్ని కనుపరుస్తుంది.[7]

ఈ పండుగలకు[8] యూదుల్లో పురుషులందరు యెరూషలేమునకు, లోక మంతటిలోనుండి వచ్చేవారు. గనుక వేలకొలది మంది యూదులు యెరూషలేము లోనికి కూడివచ్చే పస్కాపండుగ సమయం - యేసు సిలువ వేయబడే సమయంగా మహోన్నతుడు కోరుకున్నారు. రెండవ గొప్ప పండుగయైన పెంతెకొస్తు దినాన ఆయన రాజ్యం స్థాపింపబడేట్టునూ, పునరుత్థానుడైన ప్రభువునుగూర్చి ప్రకటింపబడేట్టునూ దేవుడు కోరుకున్నట్టున్నారు! జూను మాసంలో ప్రయాణపు వాతావరణం ఎక్కువ అనుకూలంగా ఉంటుంది గనుక, పస్కాకంటే పెంతెకొస్తు పండుగనే మరి ఎక్కువ మంది యూదులు యెరూషలేము చేరుకొనియుండవచ్చు.

పెంతెకొస్తు దినం, విశ్రాంతియు, వైభవముతో జరుపుకొనే మహోత్సవ దినంగా ఉంటుంది. సన్నని యెరూషలేము వీధుల్లో ఆయా దేశాల్లోనుండి వచ్చిన

యూదులతో క్రిక్కిరిసినట్టుంది. ఆ దేశాలకు సంబంధించిన రంగు రంగుల వస్త్రాలతో జనులు పండుగ మూడ్‌లో ఉన్నట్టున్నారు. ఈ దృశ్యంతో రెండవ అధ్యాయం ప్రారంభ మౌతుంది.

## సంఘ-రాజ్య ప్రారంభం (2:1-4)

సీయోనులో లేక యెరూషలేమునందు "అంత్యదినాల్లో" యెహోవా మందిరం స్థాపింపబడుతుందని యెషయా చెప్పాడు (యెషయా 2:2-3). తరువాత దేవుని గృహము లేక దేవుని యింటివారు సంఘమని పౌలు గుర్తించాడు (1 తిమోతి 3:15).[9] తన భూనివాసకాలంలో యేసు, ఈ దైవీకమైన సంస్థను "రాజ్యము" అని మాట్లాడారు. మత్తయిలో మాత్రం సంఘమే రాజ్యమైనట్టు ఆయన సూచించారు (మత్తయి 16: 18-19).[10] తన సంఘ- రాజ్యము శక్తితో వస్తుందని గట్టిగా చెప్పారు (మార్కు 9:1); పైగా ఆయన ఆరోహణానికిముందు, పరిశుద్ధాత్మ వారిమీదికి వచ్చినప్పుడు వారు శక్తి పొందుతారని తన అపొస్తలులకు వాగ్దానం చేశారు (1:8). అపొ. 2లో అద్భుత రీతిగా శక్తి వారిమీదికి వచ్చింది.

> పెంతెకొస్తను పండుగదినము వచ్చినప్పుడు అందరు ఒకచోట కూడియుండిరి. అప్పుడు వేగముగా వీచు బలమైన గాలివంటి యొకధ్వని ఆకాశమునుండి అకస్మాత్తుగా, వారుకూడియున్న ఇల్లంతయు నిండెను. మరియు అగ్ని జ్వాలలవంటి నాలుకలు విభాగింపబడినట్టుగా వారికి కనబడి, వారిలో ఒక్కొక్కనిమీద వ్రాలగ అందరు పరిశుద్ధాత్మతో నిండినవారై ఆ ఆత్మ వారికి వాక్ శక్తి అనుగ్రహించిన కొలది అన్య భాషలతో మాట లాడ సాగిరి (1-4 వచ.).

అది ఎంతటి ఉత్సాహకరమైన దృశ్యమై యుండియుంటుందో గదా! "బలంగా వీచే గాలివంటి ధ్వని" విన్పించింది. ఇది మామూలు గాలికాదు గాలిలో ఏ కదలికలేదు గాని చెవులు దిబ్బెళ్ళుపడే శబ్దం వచ్చింది (ఓక్లహోమాలో పెరిగిన నాకు పెనుతుఫాను అరుపు జ్ఞాపకం వస్తుంది!) "అగ్ని జ్వాలలవంటి నాలుకలు" కన్పించాయి; పొందినవారి తలల మీద విభాగింపబడి వ్రాలాయి. నిజమైన అగ్నికాదు[11] కాని అగ్నిలా కన్పించింది.[12] అయితే ఒక కార్యం జరుగుతుంది. ఆత్మచేత నింపబడినవారు "అన్యభాషలతో మాటలాడసాగిరి". "భాషలు" అనేది గ్రీకులో **glossa** అనే పదానికి బహువచనం.[13] వచ్చీరాని మాటలు పలకడానికో లేదా అర్థంకాని మాటలు వేగంగా పలకడానికో ఈ పదం ఉపయోగించబడలేదు.[14] వారు ఆనాటి వాడుక భాషల్లో మాట్లాడారు: "వారిలో ప్రతివాడు తమ స్వంత భాషలో వీరు మాట్లాడినట్టు విన్నారు."[15]

అపొస్తలులయొక్క చర్చనీయాంశమేమో 11వ వచనం చెప్తుతుంది. విన్నవారు యిలా అంటున్నారు: "వీరు మన భాషలతో దేవుని గొప్పకార్యములను వివరించుట

వినుచున్నామని చెప్పుకొనిరి.'' మోషేనుండి దావీదువరకు గల యూదుల చరిత్రయై యుండవచ్చు[16] (మెస్సీయాను గూర్చిన ప్రవచనాలతో పాటు). అంతకంటే మరి ఏ యితర అంశం వారిని ఆకర్షించి, పేతురు ప్రసంగం కొరకు వారి మనస్సులను అంత త్వరగా సిద్ధపరచియుంచదు.

దేవుడు పది ఆజ్ఞల నిచ్చినప్పుడు, భూమికంపించింది, ఉరుము శబ్దం దొర్లింది, మెరుపులు మెరిశాయి, ధూమం (పొగ) పైకి లేచింది (నిర్గమ. 19:18). తన క్రొత్త నిబంధనను దేవుడు మనుష్యులతో చేసినప్పుడు, తన మహాశక్తితో మానవ శ్రద్ధను ఆకర్షించడానికి - (గాలివంటి గొప్ప) శబ్దంతో, (అగ్ని జ్వాలలవంటి) గురుతుతో, సూచక (భాషలు మాట్లాడడంతో) కార్యాలను జరిగించారు.

పరిశుద్ధాత్మ వచ్చినప్పుడు శక్తి వస్తుందని, శక్తి వచ్చినప్పుడు రాజ్యం వస్తుందని ప్రభువు తెలియజేశారు. అందువలన వాగ్దానం చేయబడిన రాజ్యంయొక్క ఆరంభం అపొ. 2లో జరిగింది! అప్పటినుండి, సంఘ - రాజ్యం ఉనికిలో ఉన్నట్టే వ్యవహరింపబడింది (5:11; కొలస్సీ. 1:13; మొదలైనవి).[17]

రాజ్యం అపొ. 2. స్థాపింపబడిందనే వాస్తవాన్ని విని, ఆసక్తిని కోల్పోయినట్టు భావించవచ్చు. కాని యిది ఎంత ఆసక్తికరమయ్యిందో గ్రహించాలంటే - ఒక భక్తిగల యూదుడనన్నట్టు - జీవితకాలమంతా మెస్సీయా రాజ్యంకొరకు కనిపెడుతున్నవాడవై యున్నట్టు ఊహించుకో. మీ తండ్రి తన జీవిత కాలంలో ఆ రాజ్యం కొరకు కనిపెట్టి ప్రార్థించాడు. మీ తండ్రికి తండ్రి అలాగే కనిపెట్టాడు. యిలా శతాబ్దాలు గడిచి పోయాయి! మనకు ''రెండవ రాకడ'' అంటే ఎలాటి అనుభూతిని కలిగిస్తుందో ఆనాటి యూదులకు మెస్సీయా రాజ్యమనేది అలాటి అనుభూతినే కలిగిస్తుంది.

## అపొస్తలులయొక్క శక్తి ప్రారంభమయ్యింది (2:1-13)

అపొ. 2లో తొలి వచనాల్లో సంఘ - రాజ్య ప్రారంభంతో పాటు, అపొస్తలుల శక్తి యొక్క ఆరంభం తెలియజేయబడింది.

అపొస్తలులు పరిశుద్ధాత్మతో బాప్తిస్మం పొందుతారని, పరిశుద్ధాత్మ వారిమీదికి వచ్చినప్పుడు ''శక్తి పొందుతారని'' ప్రభువు తెలియజేశారు (1:5, 8). బాప్తిస్మమనే మాటకు అక్షరార్థం ''ముంచడం'' అని. అపొస్తలులు పరిశుద్ధాత్మయొక్క శక్తిలో ముంచబడ్డారు. మర్త్యుడైన మనుష్యుడు ఎన్నడు పొందనంత అద్భుతమైన శక్తిని పరిశుద్ధాత్మ రాకతో అపొస్తలులు పొందారు. రాబోయే అధ్యాయాల్లో, దైవప్రేరేపణతో వారు బోధించడం మాత్రమే గాక, రోగులను వారు బాగుచేయడం, దయ్యాలను వెళ్లగొట్టడం; మృతులను సహితం బ్రతికించడంవంటి కార్యాలు వారు చేసినట్టు చూస్తాం (5:12-16; 9:36-41).

(''వారు'' అని 2:1లో సూచింపబడిన పదం 120 మందికి చెందుతుందని

చెప్పి) 1:1లో చెప్పబడ్డ 120 మంది ఆత్మ బాప్తిస్మం పొందినట్టు కొందరు బోధిస్తారు. లేఖనంలో అలాటి దానికి రుజువేమీలేదు.[18] ఈ క్రింది వాటిని ఆలోచించు: (1) అపొ. 1లో ప్రభువైన యేసు పరిశుద్ధాత్మ బాప్తిస్మంను గూర్చిన వాగ్దానం అపొస్తలులకు మాత్రమే చేశారు (1:2, 4-5). (2) "వారు" అని 2:1లో ఉన్నమాట 1:26 లో అపొస్తలులకు మాత్రమే వర్తిస్తుంది (ఆది లేఖనాల్లో అధ్యాయాలు, వచనాలు అనే విభజనలేదు). (3) పరిశుద్ధాత్మతో నింపబడిన వారందరు భాషలతో మాట్లాడారు (2:4). అలా మాట్లాడిన వారందరు గలిలయులే (2:7). అపొస్తలులందరు గలిలయులేగాని, ఆ 120 మందిలో అందరు గలిలయులై యుండకపోవచ్చు.[19] (4) ఆత్మతో నింపబడిన వారంతా మద్యముతో నిండుకొనినవారైనట్టు నేరం మోపబడ్డారు (2:13). అయితే పేతురు, ఆ పదనొకండుగురితో లేచి (అంటే, మిగిలిన అపొస్తలులతో) నిలిచి, "ఈ మనుష్యులు మత్తులుకారు" అని తెలిపాడు. (5) 2:37లో జనులు అపొస్తలులనే అడిగారు, అంటే వారు మాత్రమే మాట్లాడు తున్నట్టు తెలుస్తుంది. (6) ఆత్మచేత నింపబడినవారు భాషలతో మట్లాడడానికి శక్తి పొందారు (2:4). కార్యగ్రంథం తొలి అధ్యాయాల్లో అపొస్తలులే అద్భుతశక్తులు గలవారైనట్టు కన్పిస్తుంది (2:43; 4:33; 5:12). గనుక 2:1-4లో అపొస్తలయొక్క శక్తి ఆరంభమైనట్టు గ్రహించ గలుగుతున్నాం.

ఈ శక్తియొక్క ప్రత్యక్షతకు చాలా ఉద్దేశాలున్నాయి. మొదటిగా, ఇది అపొస్తలులను శక్తితో నింపబడడం మాత్రమే గాక, వారిని ధైర్యంతో నిలిపింది. ("భూదిగంతములవరకు" వారు సువార్తను తీసికొని వెళ్లగలరనే ధైర్యాన్ని వారికివ్వాలని ఒకవేళ ప్రభువు ఉద్దేశించారేమో. ఆ సమయంలో - ఆకాశం క్రిందనున్న భక్తిగల యూదులు లోక రాజ్యాలకు ప్రతినిధులన్నట్టు నిలిచియుండగా, దేవుని సహాయంతో, వారికి సంగతులు తెలిపి, బోధించి, లోకమంతటిలోనుండి వచ్చినవారిని అపొస్తలులు మార్చగలిగారు!) అపొస్తలులు బోధించే సత్యాన్ని విన్నవారు అంగీకరించేలా యెరూషలేము వారిని ఆకర్షించడానికి (అపొస్తలుల కనుగ్రహింపబడిన) శక్తి ప్రత్యక్షపరచబడింది.

"బలముగా వీచు గాలివంటి శబ్దము వారు కూడియున్న యిల్లంతయు నిండెను" అని 2వ వచనం అంటుంది. ఆ యిల్లు మేడగదితో కూడినదైయుండే అవకాశముంది (1:13). కాని యిది దేవాలయాన్ని సూచించే అవకాశముంది.[20] పరిశుద్ధాత్మ వాగ్దానం కొరకు కనిపెడుతున్న అపొస్తలులు, "ఎడతెగక దేవాలయంలో, దేవుని స్తుతించు చుండిరి" (లూకా 24:53). మరణమంత నిశబ్దంగా ఉన్న దేవాలయపు వాతావరణాన్ని భయంకరమైన తుఫానువంటి శబ్దంతో నింపేదానికంటే, మనుష్యుల యొక్క శ్రద్ధను ఆకర్షించడానికి వేరొక మార్గాన్ని కనుగొనడం కష్టతరంగా ఉంటుంది.[21] లేకుంటే, ఆ పన్నిద్దరు ఆ జనసమూహాల మధ్య నిలిచి, వారి తలలమీద

మినుకు మినుకు మంటున్న వెలుగుతో కనబడేలా వారిని నిలబెట్టే దానికంటే మరి బలీయమైన మార్గం మరేముంటుందో, లేదా దేవుని గొప్ప కార్యాలను వారి స్వభాషలో వినిపించడంకంటే శ్రోతల మనస్సులను సిద్ధపరచడంలో మరి శ్రేష్ఠమైన విధానమేముంటుంది!

5-12వచనాల్లో శ్రోతలు ఎలా ప్రభావితం చేయబడ్డారో వర్ణింపబడింది: ''అందరు విభ్రాంతినొంది ఆశ్చర్యపడిరి'' (6) ''విని కలవరపడిరి'' (7 వ.). ''అందరు విభ్రాంతినొంది యెటు తోచక యిదేమగునో అని ఒకనితో ఒకడు చెప్పుకొనిరి'' (12 వ.).

ఈ భాగం యిలా ప్రారంభమౌతుంది: ''ఆ కాలమున ఆకాశము క్రిందనుండు ప్రతి జనములోనుండి వచ్చిన భక్తిగల యూదులు యెరూషలేములో కాపురముండిరి'' (5 వ.). ''నివసించు''చున్నారంటే, యెరూషలేములో స్థిరనివాసాలు ఏర్పరచు కొన్నారని దాని భావం కాదు. వారక్కడ తాత్కాలికంగా ఉండారనే దాని భావం కావచ్చు.[22] అనేకమంది వేలకొలది మైళ్లు ప్రయాణం చేసివచ్చి యుంటారు. గనుక అలా వచ్చినవారు రెండు పండుగలు: పస్కా, పెంతెకొస్తులు రెండు నెలలలోపే వస్తాయి గనుక రెండింటిని చూచుకొని ఒక్కసారే తిరిగి వెళ్లదామనుకొనేవారు కూడా ఉంటారు.

''ఈ శబ్దము (గాలివంటి శబ్దం కావచ్చు) కలుగగా, జనులు గుంపులుగా కూడివచ్చి, ప్రతి మనుష్యుడు తన తన స్వభాషతో వారు మాట్లాడుట విని కలవర పడిరి'' (6 వ.). లూకా మనకు చోటును గూర్చి సరిగా చెప్పలేదుగాని, అన్యజనుల ఆవరణంలో ఆయా భాగాల్లో ఆపొస్తులులు నిలిచి మాట్లాడియుండి యుండవచ్చు. పన్నెండు కంటే ఎక్కువ దేశాలకు ప్రాతినిధ్యం[23] జరిగినందున, అపొస్తలులలో కనీసం కొందరైనా (అందరు కూడా కావచ్చు) ఒకటికంటె ఎక్కువ భాషలు మాట్లాడవలసి వచ్చియుంటుంది.

''అంతట అందరు విభ్రాంతినొంది ఆశ్చర్యపడి - ఇదిగో మాటలాడుచున్న వీరందరు గలిలయులు కారా?'' అపొస్తలులందరు గలిలయులని శ్రోతలకు అర్థమయ్యింది. గలిలయుల యాస వేరుగా ఉంటుంది (7 వ.)[24] (కఠినంగాను, తక్కిన యూదులకది రమణీయము కానిదిగా ఉంటుంది). గలిలయ నాగరికంగా వెనుక బడినదిగాను, విద్యలేని వారితో నింపబడిందిగాను యూదులు భావించేవారు (4:13). ఈ గలిలయులు అనర్గళంగా ప్రతి భాషలో మాట్లాడుతూ ఉండగా జనసమూహం మరింత ఎక్కువగా ఆశ్చర్యపడ్డారు.

''మనలో ప్రతివాడు తాను పుట్టిన దేశపు భాషలో[25] వీరు మాటలాడుట మనము వినుచున్నామే; ఇదేమి?'' (8 వ.).[26] కఠినమైన హింస, ఆర్థిక అవసరతలనే వి యూదులను ప్రపంచంలో నలుమూలలకు చెల్లాచెదురు చేశాయి. అలా చెదరి

పోయినవారు కనీసం మూడు భాషలైనా మాట్లాడేవారు. స్థానిక యూదుల భాష (హెబ్రీ లేక అరామి),[27] కొయినే[28] గ్రీకు (ఆ దినాల్లోని సార్వత్రిక భాష); వారు ఏ దేశంలో జీవిస్తున్నారో ఆ దేశపు భాష. "మనము పుట్టిన దేశపు భాషలో" అని దాన్ని వారు కనుపరచారు.

తూర్పున (బబులోను, పర్వాలనుండి); పడమట (దక్షిణ ఆఫ్రికా, రోముల వరకు) లూకా 15 ప్రాంతాలను దేశాలను పేర్లతో చెప్పాడు.

> పార్తీయులు మాదీయులు ఏలామీయులు, మెసొపొతమియ యూదయ కప్పదొకియ, పొంతు ఆసియ ఫ్రుగియ పంఫులియ ఐగుప్తు అను దేశములయందలివారు, కురేనే దగ్గర లిబియ ప్రాంతములయందు కాపురమున్నవారు, రోమానుండి పరవాసులుగా వచ్చినవారు, యూదులు, యూదామత ప్రవిష్టులు[29] క్రేతీయులు అరబీయులు మొదలైన మనమందరమును, వీరు మన భాషలతో దేవుని గొప్ప కార్యములను[30] వివరించుట వినుచున్నామని చెప్పుకొనిరి. అందరు విభ్రాంతినొంది యెటుతోచక యిదేమగునో అని ఒకనితో ఒకడు చెప్పుకొనిరి (9-12 వచ.).[31]

"విభ్రాంతినొంది యెటుతోచక" అనే మాటలు అక్కడ కూడియున్న జనులను గూర్చిన సమాచారమే (12 వ.). మానవ స్వభావం అట్టిదై యుండగా, ఆ జనులలో కొందరు సందేహ వాదులున్నారు. గనుక 13వ వచనంలో, "కొందరైతే - వీరు క్రొత్త[32] మధ్యముతో[33] నిండియున్నారని అపహాస్యము చేసిరి". NIVలో - "కొందరు ... వారిని హేళన చేసిరి" అని ఉంది. వారి పలుకులు అర్థరహితమైనవే. అయితే పేతురు మాట్లాడడానికి అవి అవకాశాన్ని కల్పించాయి.

## ముగింపు

14వ వచనంనుండి 36 వరకు ఉన్న పేతురుయొక్క గొప్ప ప్రసంగాన్ని అపొ. 2లో తరువాత పాఠంలో చదువుదాం. మనం ఈ పాఠం ముగించేటప్పుడు పెంతెకొస్తు పండుగ దినంలోని ఎట్టి శ్రోతలలో మనం చేర్చబడతాం: ఆశ్చర్యపడిన వారిలోనా, లేక అపహసించిన వారిలోనా? ఆ దినాన రక్షింపబడిన 3000 మందిలో అపహసించిన వారున్నారంటే నేను సందేహిస్తాను. వాక్యంపట్ల నీకున్న దృక్పధం నీ నిత్య గమ్యాన్ని ప్రభావితం చేస్తుంది.

## ప్రసంగ సూచనలు

అపొ. 2లో బాబెలుయొక్క శాపం తిప్పివేయబడినట్లు అనేక మంది వ్యాఖ్యాన

కర్తలు గుర్తించారు. ఆదికాండం 11లో మానవాళి అనేక భాషలతో శపింపబడి, లోకమందంతట చెదరగొట్టబడ్డారు. అపొ. 2లో అనేక భాషలవారు ఒకచోట సమకూర్చబడి దీవించబడ్డారు. అనేక వ్యత్యాసాలను యింకా చూపవచ్చు! ఆది. 11లో నరులు తమ్మును తాము హెచ్చించుకోబూనారు; అపొ. 2లో దేవుడు ఘనపర చబడ్డారు. ఆది. 11లో ప్రజలు ఒకరినొకరు అర్థం చేసికోలేకపోయారు; అపొ. 2లో జనులమధ్య అవగాహన ఉంది. ఆదికాండం 11లో తిరుగుబాటు ప్రదర్శింప బడింది; అపొ. 2లో మానవ విధేయత ప్రదర్శించబడింది.

యెరూషలేము నాశనం చేయబడిన తరువాత, సీనాయి కొండనుండి మోషే ధర్మశాస్త్రాన్ని అందుకున్న దినాన (నిర్గమ. 20), యూదులు పెంతెకొస్తు దినాన్ని ఆచరింపనారంభించారు. ఈ రెండు సందర్భాలమధ్య శ్రద్ధను కలిగించే అనేక పోలికలను చూపవచ్చు. సీనాయి కొండమీద ధర్మశాస్త్రం యివ్వబడింది పస్కా తరువాత యాభై రోజులకు; పస్కాపండుగలో యేసు మరణం తరువాత యాభై రోజులకు సువార్త ప్రసంగం వచ్చింది. ఈ రెండు సందర్భాల్లోకూడా దేవుడు తన ప్రసన్నతను అద్భుత క్రియలద్వారా కనుపరచారు. ధర్మశాస్త్రం యివ్వబడినప్పుడు 3000 మంది చచ్చారు (నిర్గమ. 32:28); అయితే సువార్త ప్రకటింపబడినప్పుడు మూడువేలమంది తిరిగి జన్మించారు (అపొ. 2:41). ధర్మశాస్త్రమియ్యబడినప్పుడు భయం కలిగింది (నిర్గమ. 9:16); సువార్త ప్రకటింపబడినప్పుడు ఆనందం కలిగింది (అపొ. 2:46). పెంతెకొస్తు దినాన్ని ప్రథమ ఫలముల దినమన్నారు; వాక్యమనే ఆత్మసంబంధమైన విత్తనాలకు, అపొ. 2లో ఆత్మసంబంధమైన తొలిఫలములు వచ్చాయి (లూకా 8:11). ఇది శ్రద్ధను కలిగించే పాఠంలా చేసికోవచ్చు. తక్కిన వాటితోపాటు, ఐగుప్తు దాస్యం అంతమైన తరువాత నిర్గమ కాండంలో ధర్మశాస్త్రం ఇయ్యబడేవరకు, వేచియున్న ఏభై దినాల కాలాన్ని; (యేసు మృతిపొందినప్పుడు; కొలస్సీ. 2:14) అంతమైన పాత నిబంధననుండి క్రొత్తనిబంధన బయలుపరచ బడేవరకు (అపొ. 2లో) వేచియున్న యాభై దినాలకు పోల్చవచ్చు. చట్టసంబంధంగా, ఒక మనుష్యుని ఒడంబడిక లేక ఒప్పందం అతని మరణానంతరం అమలులోనికి వస్తుంది. అయితే వాస్తవంగా, అతని వీలునామాలోని షరత్తులు బయటపెట్టినప్పుడే అవి అమలు చేయబడతాయి. గనుక ఒకడు చనిపోయిన సమయంనుండి అతని ఒడంబడిక అమలు చేయబడే మధ్య కాలానికికూడా దీన్ని పోల్చవచ్చు.

---

సూచనలు

[1]"యెరూషలేము మొదలుకొని" అనేది (**KJV**) తర్జుమా. ఈ పాఠానికి తలరాత **KJV** పద ప్రయోగంనుండి ఉపయోగింపబడింది. [2]2 దినవృ. 8:12-13. చిన్న చిన్న పండుగలు కూడా కొన్ని ఉన్నాయి, పూరీం పండుగ లాటివి (ఎస్తేరు 9:29-32). [3]నిర్గమ.34:22; సంఖ్యా. 28:26; ద్వితీయో. 16:10; 2 దినవృ. 8:13. [4]నిర్గమ. 34:22. ఆ దినాన జరిగే ప్రత్యేకమైన సంఘటన ఏమంటే - రెండు రొట్టెలను అర్పించడం. [5]పాతనిబంధనలో ఈ

పండుగ పెంతెకొస్తని ఎన్నడూ పిలువబడలేదు. మెక్కబీస్ 2లో యిది ఈ పేరుతో గుర్తింపబడింది. క్రొత్తనిబంధనలో మూడుసార్లు ఈ పండుగ "పెంతెకొస్తు"ని పిలువబడింది. అపొ. 2:1; 20:16; 1 కొరింథీ. 16:8. [6]*Pente* అనే గ్రీకు మాటకు "ఐదు" అని అర్థం, *pentekonta* అనేది "యాభై," *pentekostos* అంటే యాభైయవ - అని అర్థం. 2:1లో ఉపయోగింపబడిన పదం *pentekostes* అక్షరార్థంగా యాభైయవ. [7]లేవీ. 23:16 ఈ పండుగ దినాన సీనాయికొండమీద యివ్వబడిన ధర్మశాస్త్ర దినంగా తరువాత కాలంలో యూదులు ఆచరించారు. నిర్గమ. 19:1ని బట్టి, ఐగుప్తులో మొదటి పస్కా జరిగిన రమారమి 50 దినాలకు ధర్మశాస్త్రమియ్యబడిందని వారు నమ్ముతారు. [8]నిర్గమ. 34:23. అపొ. 2 వచ్చేసరికి యూదులు భూమియందంతటా చెదరగొట్టబడినట్టున్నారు. అందువలన యూదుల రబ్బీలు - 90 దినాల ప్రయాణ దూరంలో ఉన్న వారందరు ఈ పండుగలకు రావాలని నిర్ణయించారట. [9]**KJV**లో "ఇల్లు" అని ఉంది. **NASB**లో "ఇంటివారు" అని ఉంది. నేటి భాషలో క్రొత్తనిబంధన (**Beck**)లో "దేవుని కుటుంబం" అని ఉంది. [10]"రాజ్యము" "సంఘము" - అనే వాటిని పర్యాయ పదాలుగా, అంటే, ఒకదానికి బదులు మరొకటి వాడేదిగా యేసు మత్తయి 16:18-19లో ప్రయోగించారు.

[11]యోహాను ప్రకటించిన అగ్ని "బాప్తిస్మము" దుష్టులు నరకంలో శిక్షింపబడడాన్ని సూచిస్తుంది. [12]అగ్ని నాలుకలుగా కన్పించిందని **NIV**లో ఉంది. [13]"**glossary**" అనే రూపంలో నేడు మనం ఈ పదాన్ని వాడుతూ ఉంటాం. భాషలు మాట్లాడడమనే ప్రక్రియను "*glossalalia*" అని అంటారు. తరువాత సంచికలో "భాషలలో మాట్లాడుట" అనే వ్యాసం వస్తుంది. [14]కాని ఆ దినాల్లో దేవతలను పూజించేవారు, వారి దేవత తమద్వారా మాట్లాడినట్లు జనులను భ్రమపెట్టడానికి అర్థంకాని మాటలు వేగంగా పలికేవారట- ఇలాటి "గూఢమైన" అసత్యాన్ని "వెర్రిపలుకులు" అని అంటారు. అపొస్తలులు చేసిన పని అదికాదు. [15]నేడు భాషలు మాట్లాడతామనేవారు అర్థంకాని మాటలను వ్యర్థంగా పలుకుతూ ఉంటారు. [16]అపొ. 7లోని స్తెఫను ప్రసంగం యిక్కడ మనకు సూచనగా ఉండవచ్చు. [17]"సంఘం - రాజ్యంయొక్క స్థాపన" గూర్చి పాఠంలోను, **Glossary** లోను చూడు. [18]యోవేలు మీ కుమారులు, కుమార్తెలంటూ స్త్రీలనుగూర్చి ప్రస్తావించాడు గనుక (2:17-18) 120మంది బాప్తిస్మం పొందారనేవారు చెప్పుతారు కాని, యోవేలు. 2:28-32లో చెప్పబడిందంతా ఆ దినానే నెరవేర్చబడిందని పేతురు అంటాడు. ఆ దినాన దర్శనాలుగాని కలలుగాని లేవు. పెంతెకొస్తు దినం యోవేలు 2లోని వాగ్దానాల నెరవేర్పుకు ఆరంభం. [19]మొదటి అధ్యాయంలో గుర్తించినట్టు, తప్పక మరియ, మార్త, లాజరు, మొదలైనవారు యూదయవారే, వారు అపొస్తలులతో ఉండి యుంటారు. [20]స్తెఫను దేవాలయాన్ని "ఇల్లు" అని అన్నాడు 7:47. "ఆ యిల్లు" అనే పదం దేవాలయాన్ని సూచించే అవకాశం లేదని కొందరన్నారు. దేవాలయం ఎన్నడూ యిల్లుగా చూపబడలేదని వారంటారు, అయితే అది సత్యం కాదు (7:47). అపొస్తలులను దేవాలయంలో కూర్చోనివ్వరు అని వారనేది కూడా సత్యంకాదు. వారు అన్యజనుల ఆవరణానికి ముందున్న గదుల్లో కూర్చోవచ్చు. యేసు దేవాలయంలోనికి వెళ్లినప్పుడు, "ఆయన కూర్చుండి వారికి బోధించారు" (యోహాను 8:2). అక్కడనుండి అపొస్తలులు దేవాలయంలోనికి నడిచిపోయి ఉండవచ్చు (అంత జనసమూహానికి స్థలం కావాలంటే చాలినంత యిక్కడే అయ్యుంటుంది) - ఏమి జరిగిందో అనే సంగతి వ్యాపించాలంటేకూడా మరోవైపు, 2:1-4లోని సంభవం అన్యజనుల ఆవరణంలో జరిగియుంటే, సంభవం సులభమనిపిస్తుంది. ఆత్మతో నింపబడి బోధించే ప్రసంగీకులు ఒకవైపు - "ఆశ్చర్యపడి, విభ్రాంతినొంది, కలవరపడిన" శ్రోతలు మరోవైపు!

[21]ఈ రోజుల్లో మనం చుట్టుచూచి శబ్దయంత్రాలు ఎక్కడ? అని అడుగుతాం. ఆ రోజుల్లో ఆ ఏర్పాట్లు లేవు. [22]భక్తిగల యూదులు ఉద్యోగ విరమణ తరువాత యెరూషలేములో స్థిర నివాసాలు ఏర్పరచుకొనడానికి వచ్చేవారట. అయితే యిది కేవలం పండుగ సందర్భంలోని సంగతి - వేలాదిమంది దర్శనానికి వచ్చినవారు. [23]9-11వచనాల్లో 15 దేశాలు గుర్తించబడ్డాయి. అయితే ఇవి కేవలం ప్రాతినిధ్యం కలిగినవే. 5వచనంలో "ఆకాశము క్రిందనున్న భక్తిగల యూదులందరు" అని సూచింపబడింది. [24]యేసు తీర్పుపొందుతున్న ఆ రాత్రివేళ, పేతురు అక్కడ నిలిచియున్నప్పుడు అతడు గలిలయుడని ప్రతివానికి తెలుసు (మార్కు 14:70; లూకా 22:59). అతడు మాట్లాడిన తీరు వానిని పట్టిస్తుంది (మత్తయి 26:73 చూడు). గనుక అపొస్తలులు ఆయా భాషలు మాట్లాడినా, వారి యాసతోనే మాట్లాడినట్టున్నారు. [25]"భాష" అని యిక్కడ తర్జుమా చేయబడిన పదం గ్రీకులో "ప్రాంతీయ భాషకు" ఉపయోగించే పదం. [26]ఇక్కడ గమనించవలసిందేమంటే - "అద్భుతపుశక్తి వినడంలోలేదు, మాట్లాడడంలోనే ఉంది" Lewis Foster, కార్యగ్రంథం వ్యాఖ్యానం, *The NIV Study Bible* [Grand Rapids, Mich.: Zondervan Publishing House, 1985], 1647). అర్థంకాకుండ మాటలాడటాన్ని భాషలు మాట్లాడే శక్తి అనేవారు, అపొ. 2లో రెండవ అద్భుతం జరిగిందనీ, వినేవారు దానిని అర్థంచేసికొనడానికి అది పనికి వచ్చిందని అన్నారు, అయినా, అక్కడ ఒక్క వాగ్దానమే చేయబడింది, అది అపొస్తలులకివ్వబడింది, పరిశుద్ధాత్మయొక్క కుమ్మరింపు ఒక్కసారే

జరిగింది; అది అపొస్తలులమీదనే. [27]అరామి అనేది హెబ్రీ భాషయొక్క మార్పు. అరామి భాషను సామాన్య యూదులు మాట్లాడేవారు. హెబ్రీ దైవాధీనలో ప్రయోగింపబడేది. [28]*Koine* అంటే "సాధారణమైన" అని అర్థం. ఇది ప్రజల భాష. [29]"**Proselyte**" అనే పదాన్ని **Glossary**లో చూడు. రోములో ఎక్కువమంది యూదులున్నారు. వారు మతప్రచారంచేసి, అన్యజనుల్లో అనేకులను తమ మతంలోనికి కలుపుకున్నారు. [30]కొందరు నోటికి అడ్డం వచ్చిన మాటలనన్నిటిని పలుకుతూ, భాషలు మాట్లాడుతున్నామంటారు. అయితే అపొస్తలులు చేసింది అలాటి కార్యం కాదు, వారు దేవుని గొప్ప కార్యాలను వివరించారు.

[31]లూకా చెప్పిన ప్రాంతాలను గుర్తించడానికి పటాన్ని చూడు. "ఆకాశము క్రింద ప్రతిజనములో నుండి" అనే తన సమాచారాన్ని రుజువు చేసికొనడానికి వీటిని తాను ఉదహరించాడో ఏమో. తూర్పున ప్రారంభించి పడమటివరకు చూపి, ఆ తరువాత తూర్పున అరేబియాకు వచ్చాడు. ఇలా ఎందుకు చేశాడో మనకు తెలియదు. [32]**KJV**లో క్రొత్త (మధ్యం) "ద్రాక్షారస" మని ఉంది. అయితే ఆ సంవత్సరపు ద్రాక్షారసపు పంట యింకా రాలేదు గనుక ఎక్కువ తర్జుమాల్లో "తియ్యని" ద్రాక్షారసమనియుంది. [33]కొందరు అపొస్తలులను అలా ఎందుకన్నారో మనకు తెలియదు.

మొదటి శతాబ్దంలోని సంఘంయొక్క పోరాటాలను, వారి విజయోత్సవాలను గూర్చిన పటాన్ని జూచి, తండ్రి బిడ్డలు థియేటరులోనుండి బయటకు వెళ్లుతున్నారు. బిడ్డ తన తండ్రి తట్టు ముఖమెత్తి - "క్రైస్తవుడై యుండటం (thrilling) పులకరింతగా ఉంటుందన్నమాట; కదండి డాడి?" అని విశేషంగా ఎత్తి చూపాడు. సువార్తికులు, ఉపదేశకులు, నాయకులనే వారిమీద: "క్రైస్తవుడై యుండడం (thrilling) పులకరింతగా ఉంటుందన్న మాట" - అన్న ఆ పసివాడి పలుకులు ఎలా పిర్యాదు చేస్తున్నాయో? క్రైస్తవ్యాన్ని గూర్చి మనం ప్రకటించేటప్పుడు క్రీస్తుకొరకు జీవించడంలో ఉండే ఆ పులకరింతను, ఆ ఉత్సాహాన్ని కలిగించడంలో మనము తప్పిపోతున్నామా?

**తెలియబడని రచయిత**